క్లుప్తంగా

మంత్రి ప్రశాంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



బాల్కొండ : మేరు కులస్తులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని సోమవారం ముప్కాల్ తహసీల్దార్ వనజ రాణికి వినతి పత్రం అందజేశారు. ఆదివారం ముప్కాల్, కొత్తపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి మేరు కులస్తులను అవమాన పరిచేల సూది కథ చెప్పడాన్ని ఖండించారు. కుల వృత్తిని చేసుకుంటు జీవనం సాగిస్తున్న మేరు కులస్తుల మనోభావాలు దెబ్బతినేల మంత్రి మాట్లాడరన్నారు. రాజకీయ లబ్ది కోసం తమ కులాన్ని వాడుకోవడం సరికాదన్నారు. కొట్టురు గంగాధర్, ఓడెలు నాగేశ్వర్, వరగంటి శ్రీనివాస్, రవీందర్, సందీప్ పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి



ఆర్మూర్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్ అన్నారు. పట్టణంలోని సీవీఆర్ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ మండల మహాసభను నిర్వహించారు. ఆర్మూర్‌లో ఎస్టీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలన్నారు. జవహర్ సింగ్, సిద్దల నాగరాజు, అర్విండ్, అభి, అరవింద్, హనుమంత్‌రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

పంటల నమోదు పూర్తి చేయాలి



బాల్కొండ : పంటల నమోదును వెంటనే పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చిట్టాపూర్‌లో పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఏఈవోలు తమ పరిధిలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. ఏఈవో నిహారిక, ఉప సర్పంచ్ రాజేందర్ పాల్గొన్నారు.

నాసిరకం పనులు చేశారని ఫిర్యాదు



మాక్లూర్ : నాసిరకం పనులు చేయటంతోనే ఇటీవల కుర్సిన వర్షాలకు మాక్లూర్ మండలంలో బీటీ రోడ్లన్నీ కొట్టుకు పోయాయని ఏఐకేఎంఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వెంకటాపూర్, మాందాపూర్, ధర్మోరా, ఒడ్డెట్‌పల్లి, అమ్రాద్ బీటీ రోడ్లు గత వేస్తే.. ఈ ఏడాది వర్షానికి అధ్వానంగా మారాయని పేర్కొన్నారు. ఈ విషయమై విచారించి ఏఈతో పాటు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే మాణిక్ భండార్ చౌరస్తా నుంచి అమ్రాద్ వరకు బీటీ రోడ్డు మరమ్మతు పనులు నాసిరకంగా సాగుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. దుడ్డు గంగాధర్, సురేష్, శివరాజు ఉన్నారు.

భూముల కేటాయింపుపై..



బోధన్: పట్టణ కేంద్రంలో విలువైన ప్రభుత్వ భూములను మైనారిటీ సామాజిక వర్గ శ్మశాన వాటికలకు అధికార పక్ష నాయకులు కేటాయిస్తున్నారని సోమవారం ఆర్డీవో ఆఫీసులో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఓట్ల కోసమే భూములను ధారదత్తం చేస్తున్నారని ఆరోపించారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించొద్దని కోరారు. సుధాకర్ చారి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రెంజల్ : మండలంలోని కళ్యాపూర్‌లో సోమవారం దివ్యాంగులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దివ్యాంగులకు ప్రభుత్వం పెంచిన పెన్షన్ సొమ్ము మొదటిసారిగా అందుకున్న లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. కాశం సాయిలు, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- బీసీలకు రూ.లక్ష సాయం నిరంతర ప్రక్రియ
- ప్రతి నెలా నియోజకవర్గానికి 300 మందికి అందిస్తాం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూరులో బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ కుల వృత్తిదారులకు చేసే ఆర్థిక సహాయం నిరంతరంగా కొనసాగుతుందని, ప్రతి నెల నియోజకవర్గానికి 300 మందికి సాయం అందిస్తామని పేర్కొన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి పనులు పేదల కోసం సీఎం కేసీఆర్ చేస్తున్నారన్నారు. ఎవరూ ఆకలితో అలమటించకూడదని ఆలోచించే గొప్ప వ్యక్తి కేసీఆర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ఎన్ని మంచి పనులు చేసినా కనబడదని విమర్శించారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా బీడీ కార్మికులకు పింఛన్లు ఇవ్వలేదన్నారు. ఎన్ని కష్టాలు వచ్చిన పెన్షన్ మాత్రం ఠంఛన్‌గా ఇస్తున్నామన్నారు. వేల కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు ధీటుగా తయారు చేశామన్నారు. సాగు నీరు, ఉచిత కరెంట్, తాగునీటి కోసం లక్షల కోట్లు ఖర్చుచేసి ప్రజలకు అందిస్తున్నమన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి కూడా కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చౌట్‌పల్లిలో పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత

కమ్మర్‌పల్లి : మండలంలోని కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, నాగాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవితతో కలిసి శంకుస్థాపన చేశారు. చౌట్‌పల్లిలో రూ.7.48 కోట్లతో చేపట్టే మెట్ల చిట్టాపూర్ సింగిల్ లైన్ రోడ్‌ను డబుల్ లైన్ బీటీ రోడ్‌గా మార్చే పనులకు, రూ. 21 లక్షలతో చేపట్టే సొసైటీ గిడ్డంగి నిర్మాణానికి, రూ.6 లక్షలతో చేపట్టే గ్రంథాలయం భవనం, రూ. 50 లక్షలతో చేపట్టే శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవాలయం ధ్వజస్తంభం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల తరగతుల ప్రారంభించడంతో పాటు, లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసిన 1200 మందికి లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను అందజేశారు. అనంతరం రూ.60 లక్షలతో కమ్మర్‌పల్లి నుంచి నాగాపూర్ అప్రోచ్ బీటీ రోడ్ పునరుద్ధరణ పనులకు, నాగాపూర్‌లో రూ.45 లక్షలతో ఉప్లూర్, నాగాపూర్ రోడ్డు మరమ్మతు పనులకు, రూ.20 లక్షలతో చేపట్టే పంచాయతీ భవన పనులకు శంకుస్థాపన చేశారు. ఎస్సీ, యాదవ, ముదిరాజ్ సంఘ భవనాలకు, మల్లన్న స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు స్వామి, శంకర్, సొసైటీ చైర్మన్‌లు రేగుంట దేవేందర్, కుంట ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం



వర్ని(చందూర్) : చందూర్‌లోని అల్లం ప్రభు ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శివయ్య గోశాలను బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం రెండో విడత మంజూరైన గొర్రెల యూనిట్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఆలయ పూజారి కొరకు నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ లావణ్య రామ్‌రెడ్డి, సర్పంచ్ సాయిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ప్యారం అశోక్, సత్యనారాయణ, మాధవరెడ్డి, గాండ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహనకు రథం..



వర్ని(మోస్రా) : ఈవీఎంలు, ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మోస్రా మండల కేంద్రంలో ప్రచార రథాన్ని సోమవారం తహసీల్దార్ కరణం శ్రీకాంత్‌రావు ప్రారంభించారు. ఎంపీవో రఫీ, ఆర్ఐ నాగమణి, జూనియర్ అసిస్టెంట్ వారిస్, తిమ్మాపూర్ సర్పంచ్ భూమన్న, బీఎల్‌వోలు పుష్పలత, కరుణ, సుమలత, దేవేందర్, జలీల్ పాల్గొన్నారు.

విద్యుత్ అమరులకు నివాళి



నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్‌లోని సీపీఎం కార్యాలయంలో సోమవారం విద్యుత్ అమరవీరుల వర్ధంతి నిర్వహించారు. అమరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్యలు, విఘ్నేష్, చిన్నయ్య, సాయిలు, అరవింద్, అభి, హనుమంత్, మనోహర్, రాజు, సాయి పాల్గొన్నారు.

సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలి

ఆర్మూర్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరడాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వి ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో విద్యుత్ అమరవీరులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ వర్ధంతి సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. డివిజన్ కార్యదర్శి దేవారం, రామకృష్ణ, ముత్తన్న, సురేష్, సత్యక్క, రమేష్ పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



రుద్రూర్‌లో వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి

రుద్రూర్ : రుద్రూర్‌లో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి ఆధ్వర్యంలో సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. మండల కార్యాలయాలనికి ర్యాలీగా వెళ్లి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో బాల గంగాధర్‌కు అందచేశారు. వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సూజాత సూర్యవంశి మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.ఆరు వేల పింఛన్ ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో రిజర్వేషన్ ఇవ్వాలని, సబ్సిడీ రుణాలు అందచేయాలని డిమాండ్ చేశారు. జల్లపురం సాయిలు, తోట గణేశ్, గోనె గంగాధర్, పిట్టల సాయిలు, సరవ్వ పాల్గొన్నారు.

నవీపేట: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నవీపేటలో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. గంగాధర్, బయ్య సతీష్, రాజు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



బాల్కొండ : ఐకేపీ ద్వారా పొందుతున్న సూక్ష్మరుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ సూచించారు. సోమవారం ముప్కాల్‌లో సూక్ష్మరుణాల ద్వారా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో దామోదర్, ఏపీఎం ప్రసాద్‌రావు, సీసీలు స్వరూప, ప్రణిత తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జ్ఞాన సంపద గొప్పది



బోధన్ : భారతీయ సంస్కృతి, జ్ఞాన, వారసత్వ సంపదలు ఎంతో గొప్పవని వేదాంత శిరోమణి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. సోమవారం పట్టణంలోని విజయ సాయి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే రూ.రెండు లక్షల రుణమాఫీ

భీమ్‌గల్ : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బెజ్జోర, ముచ్కూర్‌లలో పల్లె పల్లెకు గుండె గుండెకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే అవినీతి రహిత పాలనను అందిస్తానన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.



పోడు పట్టాల అందజేత



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న జీవన్‌రెడ్డి

మాక్లూర్ : పోడు భూములు సాగు చేసుకుంటున్న 20 మందికి సోమవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పట్టా పాస్‌బుక్కులు అందజేశారు. చిన్నాపూర్‌లో 2, అడవి మామిడిపల్లి 5, మదన్‌పల్లి 1, వేణుకిషాన్‌నగర్‌తండా 12 మందికి పట్టా పాసుబుక్‌లను అందజేశారు. తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, ఆర్ఐ షఫీ, సర్పంచ్‌లు చింత మల్లారెడ్డి, పుప్పాల లక్ష్మి, ఎనుగంటి శంకర్‌గౌడ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ముప్కాల్‌లో ఈజీఎస్ ప్రజావేదిక



ముప్కాల్‌లో ప్రజావేదిక నిర్వహిస్తున్న డీఆర్‌డీవో

బాల్కొండ : ముప్కాల్ మండలంలో 2021 -22 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథం ద్వారా చేపట్టిన పనులపై సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద రెండో విడత ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. డీఆర్‌డీవో చందర్‌నాయక్ పాల్గొన్నారు. గ్రామాల్లో చేపట్టిన తనిఖీ వివరాలను డీఆర్పీలు చదివి వినిపించారు. హరితహారంలో చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాటకపోవడంపైనే ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్‌లను మందలించారు. కాగా ఈ వేదికకు ప్రజలు రాలేదు. గ్రామాల్లో దండోరా వేయించలేదని పలువురు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వీఎస్‌ఏలు మాత్రమే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, ఎంపీడీవో దామోదర్, ఏపీవోలు ఇందిరా, అనిల్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



సిద్దాపూర్‌లో భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ

రుద్రూర్ : బాన్సువాడ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధిపై స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని జెడ్పీటీసీ నరోజి గంగారాం అన్నారు. మండలంలోని సిద్ధాపూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న బోయి సంఘం భవనం, పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ సోమవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ లక్ష్మణ్, రైతు సమితి మండల కన్వీనర్ తోట సంగయ్య, శ్రీనివాస్, పత్తి లక్ష్మణ్, అక్కపల్లి నాగేందర్, షేక్ మస్తాన్, గోవిందరావు పటేల్, చందు, భిక్షపతి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

భక్తి శ్రద్ధలతో గంగా హారతి



రెంజల్ : కేశవ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం గోదావరికి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామం నుంచి మహిళలు మంగళ హారతులతో కందకుర్తి పుష్కరక్షేత్రం వరకు పాదయాత్రగా తరలివచ్చారు. త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం భక్తులతో సందడిగా మారింది. సీతారాం త్యాగి మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ఇందూర్ జిల్లా సహ కార్యవహ ఆర్మూర్ సతీష్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై లింగార్చన



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కుమార్ పర్యవేక్షణలో మహిళలు సామూహిక సహస్ర పార్థివ లింగార్చన అభిషేక కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నియెజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పస్క నర్సయ్య, సుమన్, గంగారెడ్డి, గంగా కిషన్, మల్లయ్య, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రుద్రూర్ : మండలంలోని సులేమాన్ నగర్ పరిధిలోని గైని గుట్ట బసవేశ్వర ఆలయంలో, మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శికారి గంగాధర్, శికారి శివకుమార్, పోతంగల్ మండలం సుంకిని దిగంబర్ పటేల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రుద్రూర్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస ద్వాదశి సందర్భంగా పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

వైభవంగా శివాభిషేక మహాయజ్ఞం



ఎడపల్లి : మండలంలోని ఠాణాకలాన్‌లో స్వయంభూ లింగమూర్తి శివాలయంలో సోమవారం శివాభిషేక మహా యజ్ఞం నిర్వహించారు. పురాణోమతం వేద పండితులు అజయ్ కుమార్, సంబప్ప, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ ఎ బిల్లా సుమలత అనిల్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



రెంజల్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు



బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో..

సాక్షి, నెట్‌వర్క్ : కలెక్టరేట్ ముట్టడికి బీజేపీ పిలుపు నివ్వడంతో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులను ఠాణాలకు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు.



ఆర్మూర్‌లో..



బోధన్‌లో గృహ నిర్బంధంలో మేడపాటి ప్రకాష్‌రెడ్డి

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 - కోక్ (తెలుగు) - 11.00, 2.35, 6.10, 9.45
- స్క్రీన్-2 - గాండీవధారి అర్జున - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
- స్క్రీన్-3 - జైలర్ (తెలుగు) - 11.35, 3.00, 6.25, 9.50
- స్క్రీన్-4 - బెదురులంక-2012(తెలుగు)- 12.35,6.50,10.00 బాయ్స్ హాస్టల్(తెలుగు)-3.45

సంక్షిప్తం

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

రెంజల్ : గ్రామంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని పాలకవర్గం సభ్యులు తీర్మానించారు. రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జీపీ పాలకవర్గం సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కార్మికుల గోసను పట్టించుకోవాలి

బోధన్: ఎన్డీఎస్ఎల్ మూసివేతతో ఉపాధి కోల్పోయిన కార్మికుల గోసను పట్టించుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఫ్యాక్టరీ లేఆఫ్ కాలం నాటి నుంచి రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం నాటికి 24 వ రోజుకు చేరాయి.

నీలాలో వైద్య శిబిరం

రెంజల్: మండలంలోని నీలా, సాటాపూర్ గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లేబర్‌కార్డు కలిగి ఉన్న వారికి మాత్రమే వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. డాక్టర్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

నందిపేట్: మండలంలోని చౌడమ్మ గ్రామంలో వన సేవకుడిగా పనిచేస్తూ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన కాసర్ల గంగాధర్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని సోమవారం ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీపీ వాకిడి సంతోషకు అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. బృహత్ ప్రకృతి వనంలో పనిచేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురై మరణించడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందన్నారు. నాయకులు గంగాధర్, రాజలింగం, దేవన్న ఉన్నారు.

పోరాటానికి సహకరించాలి

వర్ని: ఆశావర్కర్ల హక్కుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న దశల వారి పోరాటాలకు సహకరించాలని సోమవారం మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్‌కు ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. శ్రీలేఖ, ఉమా, శ్యామల, లక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

మాలావత్ పూర్ణకు సన్మానం

ఆర్మూర్ టౌన్: పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణను సోమవారం ఆర్మూర్‌లో కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కోర్టుకు వచ్చిన సందర్భంగా ఆమెకు సన్మానం చేశారు. న్యాయమూర్తులు నసీం సుల్తానా, వేముల దీప్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నారెడ్డి, అశోక్, అరుణ్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల యూనియన్ కమిటీ ఎన్నిక

రుద్రూర్ : రుద్రూర్ మండల ఆశావర్కర్ల యూనియన్ నూతన కమిటీని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నన్నేసాబ్, అధ్యక్షురాలిగా వాణి (అంబం (ఆర్), కార్యదర్శిగా భూలక్ష్మి (రుద్రూర్), కోశాధికారిగా బాలమణి, కార్యవర్గ సభ్యులుగా ఉదయలక్ష్మి, పుష్ప, లక్ష్మి ఎన్నికయ్యారు.

ఫ్లెక్సీలను తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పలుచోట్ల రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి మున్సిపల్ మేనేజర్ హయుమ్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం చెట్లకు, విద్యుత్ స్తంభాలకు గులాబీ రంగువేసి అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ద్యాగ ఉదయ్, యమాద్రి భాస్కర్, జెస్సు అనిల్, వేణు పాల్గొన్నారు.